క్లుప్తంగా

నేడు, రేపు నీటి సరఫరా బంద్

సోన్: జిల్లాలోని నిర్మల్‌రూరల్, లక్ష్మణచాంద, సోన్ మండలాలకు ఈనెల 24, 25 తేదీల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాను నిలిపివేయనున్నట్లు డీఈ రాఘవేంద్రరాజు ఓ ప్రకటనలో తెలిపారు. సోన్ మండలంలోని గాంధీనగర్ భగీరథ నీటి శుద్ధి కేంద్రంలో 500 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లో మరమ్మతుల నేపథ్యంలో నీటి సరఫరాను రెండు రోజులు నిలిపివేస్తామని.. ప్రజలు సహకరించాలని కోరారు.

విగ్రహ ఏర్పాటు కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గం

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ ఏర్పాటు కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గాజర్ల సిద్విలాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా రామగిరి రంజిత్, కోశాధికారిగా కుర్రగంగాధర్(డజ్జు)యాదవ్, ప్రధాన కార్యదర్శిగా బాజగొని రంజిత్, కార్యదర్శిగా వంశీ, ప్రచార కార్యదర్శిగా రాజు, సలహాదారులుగా మారుతి, కుర్రభరత్, కమ్మల స్వామి, రాకేశ్, రాజేందర్, లక్ష్మణ్, రాజశేఖర్ తదితరులు ఎన్నికయ్యారు.

వేగంగా నడుపొద్దు



తనిఖీ చేస్తున్న ఎస్సై అశోక్

లోకేశ్వరం: వాహనాలను అతివేగంగా నడిపి ప్రమాదాల బారిన పడొద్దని లోకేశ్వరం ఎస్సై అశోక్ అన్నారు. ఆదివారం మండలంలోని మన్మద్ ఎక్స్‌రోడ్డుపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనాదారులు అన్ని ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఏఎస్సై దిగంబర్, సిబ్బంది ఉన్నారు.

సీసీ కెమెరాలతో రక్షణ



కెమెరాలను ఏర్పాటు చేయిస్తున్న సీఐ నైలు

భైంసారూరల్: సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ సాధ్యమని.. ప్రతి గ్రామంలో తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని భైంసా రూరల్ సీఐ నైలు అన్నారు. మండలంలోని వానల్‌పాడ్‌లో ఏర్పాటు చేసిన నాలుగు సీసీ కెమెరాలను ఆదివారం ప్రారంభించారు. భైంసా–నిర్మల్ జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగుతుండటంతో వానల్‌పాడ్, పేండ్‌పెల్లి మార్గాల కూడలిలో కెమెరాలను ఏర్పాటు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు ముత్యంరెడ్డి, రాంకుమార్, గ్రామస్తులు ఉన్నారు.

లైవ్ సర్టిఫికెట్ ఇస్తేనే పెన్షన్

నిర్మల్‌చైన్‌గేట్: 2024–25 ఆర్థిక సంవత్సరపు లైవ్ సర్టిఫికెట్ ఇవ్వనివారు వెంటనే పెన్షనర్ సంఘ భవనంలో అందజేయాలని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ లింగన్న ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా దాదాపు 400 మంది సర్టిఫికెట్లు ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. సర్టిఫికెట్లు ఇవ్వకుంటే పెన్షన్ నిలిపివేయబడుతుందని తెలిపారు.

వార్డ్ ఆఫీసర్ టు ఏఈ



సాయి సంప్రీత్

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన సిలారి మోడవు సుజాత–రాజేందర్ దంపతుల కుమారుడు సాయిసంప్రీత్ ఇటీవల వెలువడిన టీజీ పీఎస్‌సీ ఫలితాల్లో సత్తా చాటి మిషన్ భగీరథ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా ఎంపికయ్యాడు. ఇప్పటికే గ్రూప్–4 ఉద్యోగం సాధించి మున్సిపల్ వార్డు ఆఫీసర్‌గా నిర్మల్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈయనను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు. యువత ఓ లక్ష్యం నిర్దేశించుకొని సమయం సద్వినియోగం చేసుకుంటూ ప్రిపరేషన్ కొనసాగిస్తే నేడు కాకపోయినా రేపయినా విజయం సాధించవచ్చని సాయి సంప్రీత్ పేర్కొంటున్నాడు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా

కుభీర్: మండలంలోని సొనారి సబ్‌స్టేషన్ ఎదుట ఆదివారం ఆ ఊరి ప్రజలు ధర్నా చేశారు. సబ్‌స్టేషన్ ఉన్న గ్రామంలో 24 గంటలు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాల్సి ఉన్నా.. మా గ్రామానికి అన్యాయం జరుగుతుందని సొనారి గ్రామస్తులు ధర్నాకు దిగారు. వారితో ఏఈ ఆదిత్యనాథ్ ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు. ధర్నాలో నాయకులు మల్లారెడ్డి, నారాయణ, ముత్యంరావు తదితరులు ఉన్నారు.

బస్టాండ్ వద్ద సిగ్నల్స్ పనిచేయకపోవడంతో అడ్డదిడ్డంగా వెళ్తున్న ఆటోలు



రోడ్డుపై ఏర్పాటు చేసిన పండ్ల దుకాణాలు



గాంధీచౌక్‌లో ట్రాఫిక్ జామ్



ట్రాఫికర్ తీరేదెన్నడో..



బస్టాండ్ ఎదుట ప్రధాన రహదారిపై ట్రాఫిక్ జామ్

- నిర్మల్‌లో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- రోడ్లపైనే వాహనాల పార్కింగ్, చిరువ్యాపారం
- పట్టించుకోని అధికారులు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రమవుతుంది. నిర్మల్ పట్టణానికి నిత్యం వేలాది మంది ప్రజలు, వాహనదారులు వివిధ పనుల నిమిత్తం వచ్చివెళ్తుంటారు. షాపులకు వెళ్లే ప్రజలు వాహనాలను రోడ్డుపైనే నిలుపుతుండటం, ఫుట్‌పాత్‌లపైనే తోపుడుబండ్లను ఏర్పాటు చేస్తుండటంతో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. వాహనాల సంఖ్య పెరగడంతోపాటు రోడ్లపైనే వ్యాపారం నిర్వహిస్తుండటం ఇందుకు కారణమే. సంబంధితశాఖ అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలు చేపట్టి ట్రాఫిక్ సమస్యను నిర్మూలించాలని ప్రజలు కోరుతున్నారు.

నియంత్రించేవారేరి..

1లక్ష 70 వేల మంది నివసించే జిల్లా కేంద్రంలో 40 మంది ట్రాఫిక్ పోలీసులు ఉండాలి. కానీ పట్టణంలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, ట్రాఫిక్ పోలీసులు లేరు. గతేడాది డీఎస్పీ కార్యాలయం పక్కన తాత్కాలికంగా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసి.. ఇద్దరు ట్రాఫిక్ ఎస్సైలు, ఒక ఏఎస్సై, 12 మంది సిబ్బందిని నియమించారు. కొద్దిరోజులు వీరు పనిచేయగా ట్రాఫిక్ అదుపులోకి వచ్చినట్లు కన్పించింది. కానీ వెంటనే ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను తొలగించి.. సిబ్బందిని మరో విభాగంలోకి మార్చారు. దీంతో చౌరస్తాల వద్ద ట్రాఫిక్ తీవ్రమవుతుంది. మంచిర్యాల చౌరస్తాలో మాత్రమే సిగ్నల్ వ్యవస్థ పనిచేస్తుండగా.. మిగతా కూడళ్ల వద్ద సిగ్నల్స్ పూర్తిస్థాయిలో పనిచేయడం లేదు. ఈద్గామ్ ప్రాంతంలో ఐదు పాఠశాలలు ఉన్నాయి. ఆ చౌరస్తాలో సిగ్నల్ వ్యవస్థ పనిచేయకపోవడంతో రోజు మధ్యాహ్నం గంటపాటు ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది.

పెరుగుతున్న వాహనాలు, రోడ్లపైనే వ్యాపారాలు..

జిల్లా కేంద్రంలోనే ద్విచక్ర వాహనాల సంఖ్య 1,20,201 కాగా కార్లు 14,135, ఆటోరిక్షాలు 6,893 ఉన్నాయి. వీటితోపాటు భారీ వాహనాలు తిరుగుతూనే ఉంటాయి. కాబట్టి పోలీసుశాఖ ట్రాఫిక్ పోలీసులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లాకేంద్రంలో ప్రధాన రోడ్లను కొందరు ఆక్రమించి తమ వ్యాపారం నిర్వహించుకుంటున్నారు. దీంతో పార్కింగ్ ప్రదేశంలో ఉంచాల్సిన వాహనాలను రోడ్డుపై నిలుపుతున్నారు. పోలీసులు గమనించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు వేడుకుంటున్నారు.

జంతువుల సంచారం..

జిల్లాకేంద్రంలోని ప్రధాన రోడ్లపై జంతువులు సంచరిస్తుండటంతో ప్రమాదాలు జరుగుతుండటంతోపాటు ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నాయి. రోడ్లపైకి పశువులు రానీయకుండా పశువులకు అవగాహన కల్పించాలి.

చోద్యం చూస్తున్న అధికారులు..

జిల్లా కేంద్రంలో రోడ్లపై ఏర్పాటు చేసిన చిరువ్యాపారాలను పోలీసులు తొలగించడం లేదు. ప్రధాన కూడళ్ల వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తూ.. వాహనదారులకు జరిమానాలు విధిస్తున్నారు కానీ తోపుడుబండ్లను తొలగించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫుట్‌పాత్‌లను ఖాళీ చేయించాలి.

సమస్య పరిష్కరించాలి..



జిల్లా కేంద్రంలోని ప్రధాన సెంటర్లలో రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు. దీంతో ప్రజలకు ఇబ్బంది కలుగుతుంది. నిబంధనలు పాటించని వ్యాపారులు, వాహనదారులపై పోలీసులు చర్యలు తీసుకొని ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి. పాదచారులు నడిచేలా ఏర్పాట్లు చేయాలి.

– పూదరి శివ, నిర్మల్

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తాం. రోడ్డుపై ఇష్టానుసారం వాహనాలు నిలిపే వారిపై, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేసే వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే జరిమానాలు విధించి కేసులు నమోదు చేస్తాం. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ఐదుగురు కానిస్టేబుళ్లను నియమించాం.

– పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్

వైభవంగా షహీద్ దివస్



భైంసాలో భగత్‌సింగ్ విగ్రహం వద్ద..



దస్తురాబాద్ : బుట్టాపూర్‌లో..

భైంసాటౌన్: పట్టణంలోని భగత్‌సింగ్‌చౌక్‌లో పలు యువజన సంఘాలు, యువత ఆధ్వర్యంలో ఆదివారం షహీద్ దివస్(అమరవీరుల దినోత్సవం) నిర్వహించారు. భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పించారు. రాజ్‌గురు, సుఖ్‌దేవ్ త్యాగాలను గుర్తు చేసుకున్నారు. బీజేపీ నాయకులు బాజీరావు, శ్రీనివాస్ తదితరులున్నారు.

కుంటాల: కుంటాలలోని సృజన విద్యాలయంలో షహీద్ దివస్ నిర్వహించి.. భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ కొత్తకావు గంగన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామంలో ఆదివారం షహీద్ దివస్ నిర్వహించారు. ఈసందర్భంగా భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఇందులో ఉపాధ్యాయుడు కుర్రగంగాధర్(డజ్జు)యాదవ్, రంజిత్, తదితరులున్నారు.

దస్తురాబాద్: మండలంలోని బుట్టాపూర్‌లో రాజ్‌గురు, సుఖ్‌దేవ్, భగత్‌సింగ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ(ఎం) జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువత పోరాటాలకు సిద్ధం కావాలి

నిర్మల్‌టౌన్: మన దేశ భవిష్యత్తును కాపాడుకునేందుకు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను స్ఫూర్తిగా తీసుకొని యువత విప్లవ పోరాటాలకు సిద్ధం కావాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని ఎస్టీ బాలుర కళాశాల హాస్టల్ వసతిగృహంలో ఆదివారం పీడీఎస్ యూ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 94వ వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు తరుణ్, సంతోష్, ఆదికేశవ, రామానాయుడు, కల్యాణ్, కిశోర్, శివ, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

'అక్రమ అరెస్టులు సరికాదు'



సోన్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆశ కార్యకర్తలు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజాపాలన అని చెప్పుకొంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆశ కార్యకర్తలను ముందస్తు అరెస్ట్ చేయడం సిగ్గుచేటని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి బొమ్మెన సురేశ్ పేర్కొన్నారు. ఆశ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ఈనెల 24న 'చలో హైదరాబాద్' తలపెట్టగా జిల్లా వ్యాప్తంగా ఆశ కార్యకర్తలను ఆదివారం ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ.. కరోనా సమయంలో ఆశ కార్యకర్తల సేవలను గుర్తించిన ప్రభుత్వం నేడు ఉద్యమాన్ని అణచివేసే ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల్లో ఆశ కార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇచ్చేలా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిర్మల్‌రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని ఆశవర్కర్ల యూనియన్ రాష్ట్ర కమిటీ సోమవారం చలో హైదరాబాద్ కార్యక్రమం తలపెట్టారు. దీంతో మండలంలోని ఆయా గ్రామాల ఆశవర్కర్లను హైదరాబాద్ వెళ్లకుండా ఆదివారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాత, మంగ, లావణ్య, సునీత, ఊర్మిళ, అమృత, సుశీల, అనురాధ, లావణ్య, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

లోకేశ్వరం: చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆశ కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్సై అశోక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: తమ డిమాండ్ల సాధనకు హైదరాబాద్‌లో తలపెట్టిన ధర్నాలో పాల్గొనకుండా మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఆశ కారకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో శారద, రత్నమాల, లక్ష్మీ, విజయ, వనిత తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు శంకర్

భైంసాటౌన్: నియోజకవర్గంలోని గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.4.39 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ చంద్రే తెలిపారు. ఆదివారం పట్టణంలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బి.నారాయణ్‌రావు పటేల్ ఆధ్వర్యంలో నిధుల మంజూరుకు విన్నవించగా ప్రభుత్వం విడుదల చేసినట్లు తెలిపారు. నిధులు మంజూరు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, నారాయణ్ రావు పటేల్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు రాంచందర్‌రెడ్డి, గంగారెడ్డి, జంగం రమేశ్, నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

తానూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో అంతర్గత రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి ఉపాధిహామీ పథకం కింద రూ.1.10కోట్లు మంజూరు కావడంపై కాంగ్రెస్ కార్యకర్తలు హర్షం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు పుండలిక్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, మాజీ ఎమ్మెల్యే నారాయణరావుపటేల్‌కు ధన్యవాదాలు తెలిపారు. తానూరు మాజీ సర్పంచ్ మాధవ్‌రావుపటేల్, మాజీ కోఆప్షన్ సభ్యులు గోవింద్‌రావుపటేల్, చంద్రకాంత్‌యాదవ్, నాయకులు హన్మంత్‌రావు, పాండుపటేల్, అంబదాస్, ధర్మేందర్, బాబు వాగ్మారే పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు ఆలయ వార్షికోత్సవం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని దత్తాత్రేయనగర్ శివపంచాయతన యంత్రోధారక ఆంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఈనెల 24న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి గణపతిపూజ, మూల మంత్ర వావనం, అష్టోత్తర కలశపూజ, శివపార్వతి కల్యాణం, పూర్ణాహుతి తదితర పూజాది కార్యక్రమాలు జరిపించనున్నట్లు పేర్కొన్నారు.

ఒకే దేశం– ఒకే ఎన్నికతో అభివృద్ధి

బాసర: ఒకే దేశం–ఒకే ఎన్నిక(వన్ నేషన్– వన్ ఎలక్షన్)తో దేశంలో ఖర్చు తగ్గి అభివృద్ధి జరుగుతుందని బీజేపీ మండలాధ్యక్షుడు పి.సాయినాథ్ అన్నారు. మండలకేంద్రంలో ఆ పార్టీ కార్యకర్తలకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే ఖర్చు తగ్గడంతోపాటు పోలింగ్‌శాతం పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు సతీశ్‌రావు, ప్రతాప్ రావు, సాయినాథ్, రమేశ్, నర్సింగ్ రావు, జల్లు, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

అర్ధమండల దీక్షలు ప్రారంభం

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీ హనుమాన్ ఆలయంలో ఆదివారం భక్తులు అర్ధమండల దీక్షలు స్వీకరించారు. అర్చకులు కీర్తి రాఘవశర్మ ఆధ్వర్యంలో సుమారు 50 మందికి పైగా మాలధారణ చేశారు. కార్యక్రమంలో గురుస్వామి పెరక గంగాధర్ తదితరులు ఉన్నారు.

దస్తురాబాద్ మండలంలో..

దస్తురాబాద్: మండలంలోని దేవునిగూడెం, భూత్కూర్, దస్తురాబాద్, పేర్కపల్లె, మున్యాల గ్రామాల్లో భక్తులు ఆదివారం హనుమాన్ దీక్షలు స్వీకరించారు. గోదావరిలో పుణ్యస్నానాల అనంతరం హనుమాన్ ఆలయాల్లో అర్చకులు వంశీధర్, నరేష్‌చార్యులు, రాజేశ్ ఆధ్వర్యంలో 80మంది స్వాములు అర్ధమండల దీక్షలు స్వీకరించారు.

పనులు ప్రారంభం

నర్సాపూర్(జి): మండల కేంద్రం శివారులో ఉపాధి నిధులు రూ.20లక్షలతో 350 మీటర్ల మేర నిర్మించే సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్మల్ ఏఎంసీ డైరెక్టర్ అజీమ్, నాయకులు కొండ్ర రమేశ్, సాయన్న, ఆయిటి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ గ్రామంలో బహుళజాతి సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా రమణగౌడ్, ఉపాధ్యక్షుడిగా నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా సురేశ్‌గౌడ్, కోశాధికారిగా భూమేశ్వర్, కార్యదర్శిగా రాజేశ్వర్‌గౌడ్, సలహాదారులుగా నారాగౌడ్, లింగాగౌడ్, రాజేందర్, జనార్దన్, నవీన్ ఎన్నికయ్యారు.

'అనుచిత వ్యాఖ్యలు సరికాదు'

ఖానాపూర్: ఆదివాసీ మహిళ కార్పొరేటర్ బానావత్ సుజాత నాయక్‌పై ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆనంద్ రావు, రాజేశ్వర్, వసంత్‌రావు, శేఖర్ ఉన్నారు.

గ్రామాల్లో వర్షం

దస్తురాబాద్: మండలకేంద్రంతోపాటు మండలంలోని బుట్టాపూర్, గొడిసీర్యాల, రేవోజీపేట, మల్లాపూర్, పేర్కపల్లె, ఆకొండపేట, మున్యాల గ్రామాల్లో ఆదివారం ఓ మోస్తారు వర్షం కురిసింది. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఈదురుగాలులతో వడగండ్ల వాన కురిసింది.

రేపు చాలీసా పారాయణం

ఖానాపూర్: పట్టణంలోని కొమురంభీం చౌరస్తాలో ఉన్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఆవరణలో ఈనెల 25న హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, అజయ్ ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు రావాలని కోరారు.

డీ–16 కాలువకు గండి



గండిని చూపుతున్న రైతు సాయన్న

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామ సమీపంలో డీ–16 ఉప కాలువకు గండి పడింది. సరస్వతి కాలువకు ఉపకాలువ అయిన డీ–16కి గండి పడటంతో నీళ్లు వృథాగా పోతున్నాయి. అధికారులు స్పందించి గండిని పూడ్చి వేసి నీటి వృథాను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

డాక్టర్ దంపతుల శ్రమదానం




వ్యర్థాలను తొలగిస్తున్న వైద్యులు, సిబ్బంది

సోన్: మండలంలోని మాదాపూర్ పుష్కర ఘాట్ వద్ద ఆదివారం నిర్మల్ పద్మిని ఆసుపత్రి వైద్యులు అనిత–రామకృష్ణ దంపతులు, సిబ్బంది శ్రమదానం చేసి పరిసరాలను శుభ్రం చేశారు. వివరాల్లోకి వెళితే.. ఇటీవల డాక్టర్ దంపతులు మాదాపూర్ పుష్కరఘాట్‌కు వచ్చినప్పుడు పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో వారు చలించిపోయారు. ఉదయం నుంచి చీకటి పడేవరకు చెత్తాచెదారం ఏరివేశారు. త్వరలో మళ్లీ వచ్చి శ్రమదానం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యుడు రామకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అడెల్లిలో భక్తుల సందడి

సారంగాపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉమ్మడి జిల్లాతోపాటు వివిధ ప్రాంతాల ప్రజలు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ రమేశ్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

25 ఏళ్లకు కలిసిన వేళ



సమావేశమైన పూర్వవిద్యార్థులు

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలోని రవి హైస్కూల్‌లో 2000–01లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 25 ఏళ్లకు తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలలోనే సమావేశమయ్యారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని పాఠశాల జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. గురువులు వెంకటేశ్వరరావు, శ్రీనివాస్‌రెడ్డి, రాణి, మునిందర్, శ్రీనివాసచారి, మోహన్‌రావు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్




ఇఫ్తార్‌విందులో పాల్గొన్న ఇంద్రకరణ్‌రెడ్డి, నేతలు

నిర్మల్‌టౌన్: పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లింల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ఆర్‌ఆర్ గార్డెన్‌లో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అర్జుమండ్ అలీ ఆధ్వర్యంలో ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి హాజరై మాట్లాడారు. సామూహిక నమాజ్ అనంతరం ముస్లింలకు ఫలహారం తినిపించారు. అన్ని మతాలు చెప్పేది ఒకటేనని అందరూ సోదరభావంతో కలిసిమెలిసి ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కరీంనగర్ గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశ్, కాంగ్రెస్ నాయకులు నాందేడపు చిన్ను, మతపెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.

భూపంచాయితీ.. రైతు ఆత్మహత్యాయత్నం

నిర్మల్: గ్రామంలో నెలకొన్న భూపంచాయితీ ఎటూ తేలకపోవడంతో మనస్తాపం చెందిన ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన లక్ష్మణచాంద మండలం పొట్టపెల్లి(కే)లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే గ్రామాన్ని ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిని తొడిశెట్టి భూమన్న అనే రైతు ఆరేళ్లుగా సాగు చేస్తున్నాడని వీడీసీ(గ్రామాభివృద్ధి కమిటీ) ఆరోపిస్తోంది. ఈమేరకు ఈనెల 10న జిల్లాస్థాయి అధికారులు గ్రామంలో సర్వే చేపట్టారు. భూమన్న సాగు చేస్తున్న సర్వే నంబర్లలో ప్రభుత్వ భూమి ఉందని వారు తేల్చినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. భూమన్న మాత్రం రాచాపూర్ గ్రామస్తుల దగ్గర నుంచి తాను ఐదెకరాలు కొనుగోలు చేశానని.. వారు చూపిన మేరకు తన భూమి సాగు చేసుకుంటున్నట్లు పేర్కొన్నాడు. అనంతరం న్యాయవాది ద్వారా కోర్టుకు వెళ్లి వీడీసీ సభ్యులకు నోటీసులు పంపించారు. నోటీసు అందుకున్న వీడీసీ సభ్యులు ఆదివారం భూమన్నను పిలిపించి.. తాము ఊరి కోసం మాట్లాడితే తమకు ఎందుకు నోటీసులు పంపించావని ప్రశ్నించారు. ఇదే క్రమంలో తన భూమి పంచాయితీ తేలడం లేదని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబసభ్యులు గమనించి వెంటనే భూమన్నను నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. రెవెన్యూ అధికారులు చొరవ చూపకపోవడంతోనే ఈ సమస్య వచ్చిందని.. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈవిషయం తెలుసుకున్న ప్రొబేషనరీ ఎస్సై జుబేర్ పొట్టపెల్లికి చేరుకుని వీడీసీ సభ్యులు, భూమన్న కుటుంబంతో మాట్లాడి వివరాలు సేకరించారు. ప్రస్తుతం భూమన్న ఆరోగ్యం మెరుగ్గా ఉందని ఆయన పేర్కొన్నారు.

క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కడెం: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై హర్షం వ్యక్తం చేస్తూ కడెంలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ఆదివారం కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఖానాపూర్ ఏఎంసీ చైర్మన్ పడిగెల భూషణ్ మాట్లాడుతూ రాజీవ్‌యువ వికాసం పథకం ప్రారంభించి అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచిందని పేర్కొన్నారు. ఇందులో జిల్లా నాయకుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్, తరి శంకర్, యాదగిరి, నారాయణ, బొడ్డు గంగన్న, లచ్చన్న, కోల శ్రీనివాస్, భూమేశ్, శేఖర్, బబ్లూ, రహీం, రాజు, సలీం, ధర్మయ్య తదితరులున్నారు.